చిన్నకథ

ఈ మధ్య మా స్నేహితుడు సుబుద్ధి తల్లిదండ్రులు అంటే 75-80 ఏళ్ల మధ్య వయస్సులే- తీవ్ర అస్వస్థతకు గురి అయి మృత్యు ముఖం నుండి బయటపడ్డారని తెలిసి ఓ మాటు పలకరిద్దామని వెళ్లాను.

# 'లక్ష'్యం

- బులుసు-జీ-ప్రకాష్

"మా అమ్మ గురించి నలభైరోజులు, నాన్న గురించి నలభైరోజులు మృత్యుంజయ మంత్రం జపించా నోయ్! ఆ పరమశివుడు కటాక్షించి వారిద్దరినీ మృత్యుముఖం నుండి బయట పెట్టాడోయ్'' అన్నాడు. సుబుద్ధి.


"మరి మందులు ఏవీ ఇప్పించలేదా? మృత్యుంజయ మంత్రం ఒక్కటే జపించి మీ తల్లిదండ్రుల్ని బతికించుకున్నావా?''

"లేదయ్యా! ఖరీదైన మందులు కూడా ఇప్పించాను. ఆ మందులు పని చెయ్యాలంటే పారాయణలు జపాలు కూడా చెయ్యాలి.''

"సంతోషం'' అనుకున్నాను. 'మాతృదేవోభవ, పితృదేవోభవ' అనే ఆర్యోక్తి ననుసరించి, తల్లిదండ్రుల పట్ల తనకు గల భక్తి ప్రపత్తులకి హర్షించాను.

సుబుద్ధి భార్య ఇచ్చిన కాఫీ సేవించి నిష్క్రమించాను.

మరో నెలరోజుల్లో అదే- ఆ సుబుద్ధి భార్యకి తీవ్రమైన సుస్తీ చేసిందనే తెలిసి ఓ సారి చూద్దామని వెళ్లాను. ఏవో మందులు ఇప్పిస్తున్నాడు. ముక్కులో గొట్టం పెట్టి ఊపిరి పోస్తున్నారు.




"ఏమయ్యా! మీ శ్రీమతికి ఇంత సుస్తీ చేస్తే కేవలం మందులతోనే ఆపేశావేమిటి? ఆ మందులు పని చెయ్యడానికి మృత్యుంజయ మంత్రం జపించలేదేం?'' అడిగాను కుతూహలం చంపుకోలేక.

"తల్లిదండ్రులు పోతే మళ్లా వస్తారటయ్యా? పెళ్లాం పోతే ఇంకొకర్తి...'' అన్నాడు సుబుద్ధి నాలుక్కర్చుకుంటూ.

"అంటే ఈ పెళ్లాం పోతే మరొకర్తి మరో లక్షతో వస్తుందనా నీ లక్ష్యం? హరి భడవా ఇదా నీ దురాలోచన? నీకు దుర్బుద్ధి అని పేరు పెట్టాల్సింది. మీవాళ్లు!'' అని కడిగేశాను.

"హుష్! మెల్లిగా మాట్లాడు, మా ఆవిడ వింటే బాధ పడుతుంది.'' అంటూ ఓ చిరుమందహాసం చేశాడు సుబుద్ధి, కాదు కాదు దుర్బుద్ధి.

మరి కొన్నాళ్లకి సుబుద్ధి భార్య సంపూర్ణమైన ఆరోగ్యంతో కోలుకుంది.

అనూహ్యమైన పరిస్థితుల్లో సుబుద్ధి ఒక కారు ప్రమాదానికి గురై శాశ్వతంగా కన్నుమూశాడు. సుబుద్ధి తల్లిదండ్రులు, భార్య, ఎంత రోదించినా చచ్చినవాళ్లు తిరిగి రారు కదా! అతనికి రావలసిన ఇన్స్యూరెన్స్ డబ్బు, ప్రావిడెంటు ఫండు బకాయిలు వచ్చాయి. భార్యకు ఉద్యోగం కూడా వచ్చింది.

ఇప్పుడామె తన అత్తమామల్ని శ్రద్ధగా చూసుకుంటూ, వంటా వార్పూ చేసుకుంటూ, ఉద్యోగ బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తిస్తూ త్రిపాత్రాభినయం సమర్థవంతంగా చేస్తోంది.

లలాట లేఖా న పునః ప్రయాతి!

★